




వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. శుక్రవారం స్వామివారిని 26,928 మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. కోడెమొక్కులు చెల్లించిన అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.
- ప్రజానావ, వేములవాడ


ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
శనివారం
7 డిసెంబర్ 2024



# ఇదేం చె(చి)త్తశుద్ధి?!



- సిరిసిల్లలో పడకేసిన పారిశుధ్యం
- జనావాసాల్లోనే ఈటీపీ సెంటర్
- రోగాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఫిర్యాదు చేసినా స్పందించని మున్సిపల్ అధికారులు

**ప్రజానావ, సిరిసిల్ల బ్యూరో:** రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో పారిశుధ్యం పడకేసింది. స్థానిక పద్మా నగర్, అనంత నగర్, అంబికనగర్, వెంకట్ పేట్ మీదుగా ఉన్న మురికి కాల్వకు అడ్డంగా ఈటీపీ సెంటర్ నిర్మించారు. దీంతో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదరం నిండి దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పటికే దోమలు పెరిగి పలువురికి డెంగీ, మలేరియా జ్వరాలు సోకి ఆస్పత్రుల్లో చేరారు. ఈటీపీ సెంటర్ నిర్మించనప్పటి నుంచే తాము వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈటీపీ సెంటర్‌ను ఇక్కడి నుంచి వెంటనే తొలగించాలని మున్సిపల్ అధికారులకు ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కలెక్టర్ సైతం ఫిర్యాదు చేశామని, అయితే కలెక్టర్ ఈ కాల్వను పరిశీలించి వెళ్లినా అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కాల్వకు అడ్డంగా ఉన్న ఈటీపీ సెంటర్‌ను తొలగించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



# మీ చేతుల్లోనే ప్రజారోగ్యం

- వైద్య వృత్తి ద్వారా పేదలకు సేవ చేయాలి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఘనంగా వైట్ కోట్ వేడుక

**ప్రజానావ, సిరిసిల్ల బ్యూరో:** ప్రజారోగ్యం మీ చేతుల్లోనే ఉందని, వైద్య వృత్తి ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వైద్య విద్యార్థులను సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలో శుక్రవారం వైట్ కోట్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్య విద్యార్థి జీవితంలో ఈరోజు ప్రత్యేకమైన రోజని, ఎన్నో ఏళ్లుగా వైద్య వృత్తిని చేపట్టాలని కలలుగని నేడు వైట్ కోట్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముందుకు సాగాలని సూచించారు. గొప్పగా పనిచేస్తూ వైద్య వృత్తికే ఒక పేరు తెచ్చే విధంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. రానున్న కాలంలో మీస్థాయిలో పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందించాలని కోరారు. ప్రభుత్వం వైద్య విద్యను ప్రోత్సాహించేందుకు ఇటీవల నూతనంగా కాలేజీలను ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే 16 నూతన నర్సింగ్ కళాశాలను ప్రారంభించడం జరిగిందని గుర్తుచేశారు. ప్రజారోగ్యం కోసం 240 పైచిలుకు అంబులెన్స్ అందుబాటులోకి తెచ్చామని, ప్రతి పేదవాడికి వైద్యం అందాలనే సంకల్పంతో ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షల పెంచినట్లు చెప్పారు. ఇదిలాఉంటే ప్రతి మెడికల్ కాలేజీలో తొలి ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థులు అకడమిక్ విద్య నుంచి క్లినికల్ విద్యలో ప్రవేశించే క్రమంలో వైట్ కోట్ వేడుకను నిర్వహించడం ఆనవాయితీ.

# దొంగతనం కేసులో వ్యక్తికి జైలు, జరిమానా

**ప్రజానావ, సిరిసిల్ల:** దొంగతనం కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలుతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఐ చెప్పిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా లింగపూర్ గ్రామానికి చెందిన వేగం శ్రీనివాస్ సిరిసిల్లలోని శాంతినగర్ లో రూమ్ అద్దెకి తీసుకొని మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 26న చంద్రంపేటకు మేస్త్రి పనికి వెళ్లి సాయంత్రం సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద బండి మార్చి పోయి ఇంటికి వెళ్లాడు. తిరిగి రాత్రి బస్టాండ్ వద్దకు వచ్చి చూడగా బండి కాలిపోయి ఉంది. వెంటనే శ్రీనివాస్ పోలీసులకు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దొంగతనం చేయుటకు ప్రయత్నించి తాళం రాకా కాలబెట్టిన కేసులో ఎస్ఐ మల్లేశం సిరిసిల్లలోని సుభాష్‌నగర్‌కు చెందిన కంచం వేణు (42)ను నిందితుడిగా గుర్తించారు. వేణుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ చెలుముల సందీప్ వాదించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నేరస్తుడు కంచం వేణుకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ కృష్ణ పేర్కొన్నారు.

# భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు

**ప్రజానావ, వేములవాడ:** అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ వేములవాడ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన వివరాల మేరకు.. బోయినిపల్లి మండలం తడగొండ గ్రామానికి చెందిన మహేందర్‌కు గంగాధర మండలం పిట్టలపల్లి గ్రామనికి చెందిన మమతతో 2011లో వివాహం జరిగింది. కొన్నేళ్లుగా అదనపు కట్నం తీసుకురావాలని భార్యను మహేందర్ వేధింపులకు గురిచేయడంతో 2017లో బోయినిపల్లి పోలీస్ స్టేషన్ మహేందర్ పై భార్య ఫిర్యాదు చేసింది. పోలీసులు మహేందర్ పై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యుషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ విక్రాంత్ వాదించగా సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కానిస్టేబుల్ మధుసూదన్, రాజేంద్ర ప్రసాద్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో మహేందర్ కి శిక్ష విధించినట్లు వేములవాడ రూరల్ సీఐ తెలిపారు.

# పోలీస్ శాఖలో హోంగార్డుల సేవలు కీలకం

- రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్
- పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఘనంగా 62వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం



**ప్రజానావ, సిరిసిల్ల:** పోలీస్ శాఖలో హోంగార్డుల సేవలు కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ కొనియాడారు. 62వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కారించుకొని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు సాయుధ హోంగార్డు ప్లాటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కవాతు పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో ఒక భాగమై పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు ఆఫీసర్స్ అందిస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు. సాధారణ విధులు మొదలు క్లిష్టతర విధుల వరకు అన్నింటా చక్కగా పనిచేస్తూ హోంగార్డు వ్యవస్థ పోలీస్ శాఖలో కీలకంగా మారిందన్నారు. శాంతిభద్రతలు, ప్రజలకు రక్షణ కల్పించడంతో బాధ్యతయుతమైన సేవలు అందించడంతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ , తమిళనాడు రాష్ట్రాలలో ఎన్నికల బందోబస్తులో అప్పగించిన భాధ్యతలు నిబద్ధతతో నిర్వహించారని గుర్తుచేశారు. నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసుల ప్రతిష్టను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. హోంగార్డుల సంక్షేమం, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగిందని, రాయితీతో కూడిన హెల్త్ కార్డ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. హోంగార్డ్స్ వారి కుటుంబాలపై దృష్టిసారించి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి ఉన్నతస్థాయిలో ఆఫీసర్లుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రమేశ్, మధూకర్, పోలీస్ సిబ్బంది, హోంగార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్‌కు ఘన నివాళి

**ప్రజానావ, ఖైరతాబాద్:** జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ లో మహనీయుల చౌరస్తా దగ్గర డా.బీఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులరించారు. ఈ కార్యక్రమంలో 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షులు మామిడి నర్సింగరావు, జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాటూరి రమేశ్, డీసీసీ ఖైరతాబాద్ జనరల్ సెక్రెటరీ శ్యాంసుందర్ నాయుడు, సీనియర్ నాయకుడు ఆకుల రాజు, జూబ్లీహిల్స్ డివిజన్‌లోని వివిధ బస్తీ సంక్షేమ సంఘాల నాయకులు, కాంగ్రెస్ సీనియర్ నేతలు, యూత్ కాంగ్రెస్ నాయకులు అడ్డాకుల బెంజిమెన్, ఎండీ గౌస్, బోదాస్ నాగార్జున, గుంజ ఆంజనేయులు, కే.రాములు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో..

జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ మహనీయుల విగ్రహాల వద్ద భారతరత్న డా. బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కాడిగారి భోజిరెడ్డి, ఖైరతాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు బొట్టు కళ్యాణి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా లీగల్ సెల్ కో- కన్వీనర్ కస్తూరి మహిపాల్ రెడ్డి, జూబ్లీహిల్స్ డివిజన్ ప్రధాన కార్యదర్శి గణేశ్ యాదవ్, జూబ్లీహిల్స్ డివిజన్ ఉపాధ్యక్షులు బోయ రామాంజనేయులు, వుట్ల శశిశేఖర్, బీజేపీ సీనియర్ నాయకులు రాజారాం యాదవ్, శ్రీనివాస్ చారి, జూబ్లీహిల్స్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు డోంగరి రాజకళ, ప్రధాన కార్యదర్శి రమ్య, జూబ్లీహిల్స్ డివిజన్ యువమోర్చా అధ్యక్షుడు మక్కలి నరేశ్, బీజేవైఎం నాయకులు మంజలి నరసింహా, ముద్దంగుల అంజి రాజు, హనుమంతు ముదిరాజు, బాలిశ్వర్, గుమ్మకొండ వెంకటేశ్, అరవింద్ గౌడ్, వలిశెట్టి రాంబాబు, పల్లపు అర్జున్, శ్రీకాంత్, వరికుప్పల వెంకటేశ్, స్థానిక నాయకులు, నేతలు పాల్గొన్నారు.





